క్లుప్తంగా

21న మోడల్ పాఠశాల ప్రవేశ పరీక్ష

ముండ్లమూరు (కురిచేడు): స్థానిక మోడల్ పాఠశాలలో 6వ తరగతిలో చేరేందుకు ఈ నెల 21న ప్రవేశ పరీక్షలు నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ కె.పూర్ణచంద్రరావు తెలిపారు. ఈ విషయాన్ని దరఖాస్తు చేసుకున్న ప్రతి విద్యార్థి గమనించి ప్రవేశ పరీక్షకు హాజరు కావాలని కోరారు. ప్రవేశ పరీక్ష రాయనున్న విద్యార్థులకు గురువారం అవగాహన సదస్సు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. అవగాహన సదస్సుకు హాజరై అనుమానాలు నివృత్తి చేసుకోవాలని కోరారు. కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చేరాలనుకునే విద్యార్థులు మే 22వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ పూర్ణచంద్రరావు తెలిపారు.

పంట నష్టపోయిన రైతులకు న్యాయం చేస్తాం



పంటను పరిశీలిస్తున్న ఏవో ప్రసాద్‌రావు

తాళ్లూరు: రెండు రోజులుగా కురిసిన వర్షాలకు, గాలులకు పంట నష్టపోయిన రైతులకు న్యాయం చేస్తామని ఏవో బి.ప్రసాద్‌రావు తెలిపారు. మండలంలోని కొర్రపాటివారిపాలెం, కొత్తపాలెం, మాధవరం, విఠలాపురం, మల్కాపురం గ్రామాల్లో రైతులు వేసిన పంటలను ఆయన బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ మండలంలో వర్షపాతం 45.8 మిల్లీ మీటర్లుగా నమోదైందని, పంట నష్టపోయిన రైతుల వివరాలు వీఏఏల ద్వారా తెలుసుకొని న్యాయం చేసే చర్యలు చేపడతానన్నారు. తాళ్లూరు గ్రామానికి చెందిన కోట చంద్రశేఖర్‌రెడ్డి, కృష్ణారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డిలు సాగు చేసిన మొక్కజొన్న పంట కొంత నష్టం జరిగింది.

రుణాల కోసం దరఖాస్తుల ఆహ్వానం

తాళ్లూరు: ఎస్సీ కార్పొరేషన్ రుణాల కోసం అర్హత ఉన్న ప్రతి ఒక్కరూ దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో దారా హనుమంతురావు బుధవారం ఒక ప్రకటనలో కోరారు. ఆధార్ కార్డు, కులం సర్టిఫికెట్, ఆదాయ సర్టిఫికెట్, డేటాఫ్ బర్త్ సర్టిఫికెట్, రైస్‌కార్డు, ఫోటోలు 3, ఆధార్ లింకైన ఫోన్ నంబర్‌తో మీసేవ కేంద్రం వద్దకు వెళ్లి దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో సూచించారు.

బైకు అదుపుతప్పి వ్యక్తికి తీవ్రగాయాలు



గాయపడిన గురుస్వామి

దొనకొండ: ద్విచక్ర వాహనం అదుపు తప్పి వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ సంఘటన బుధవారం సాయంత్రం జరిగింది. అందిన సమాచారం.. కొనకనమిట్ల మండలం రేగడిపల్లి గ్రామానికి చెందిన బి.గురుస్వామి పనిపై దర్శి మండలం చందలూరుకు వెళ్లాడు. పని ముగించుకుని తిరుగు ప్రయాణంలో స్థానిక కస్తూరిబా గాంధీ గురుకుల పాఠశాల మలుపు వద్ద ఆయన ద్విచక్ర వాహనం అదుపుతప్పడంతో తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం తెలుసుకున్న 108 సిబ్బంది ఈఎంటీ పి.వెలుగొండయ్య, పైలట్ షేక్ జానీ బాషాలు ప్రథమ చికిత్స అందించారు. 108లో మెరుగైన వైద్యం కోసం దర్శి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ఈ విషయం తెలుసుకున్న డీఎం విజయకుమార్, ఓఈ రాజేంద్రప్రసాద్‌లు 108 సిబ్బందిని అభినందించారు.

వేసవిలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

కురిచేడు: మండల ప్రజలు వేసవిలో అప్రమత్తంగా ఉండాలని ఎస్సై ఎం.శివ తెలిపారు. వేసవి కాలం ఆరంభం కావటంతో పాటు శుభకార్యాలకు, పుణ్యక్షేత్రాలకు, బంధువుల ఇళ్లకు వేరే గ్రామాలకు వెళ్లే వారు పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. దొంగతనాలు పెరిగిపోతున్నాయని, దొంగలను అదుపు చేయడం కోసం ప్రజలు సహకరించాలని కోరారు. వీలైనంత వరకు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, ఎవరైనా కొత్త వ్యక్తులు గ్రామాల్లో సంచరిస్తున్నట్లు తెలిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని సూచించారు.

నూర్‌బాషాలకు సముచిత స్థానం కల్పించాలి

తర్లుపాడు: రాష్ట్రంలో నూర్‌బాషాలకు నామినేటెడ్ పదవుల్లో సముచిత స్థానం కల్పించాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నూర్‌బాషా(దూదేకుల) యువజన సంక్షేమ సంఘ అధ్యక్షుడు డీపీ మస్తాన్ బుధవారం ఓ ప్రకటనలో ప్రభుత్వాన్ని కోరారు. 4 ఎమ్మెల్యేలు, వక్ఫ్‌బోర్డు చైర్మన్, మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్, మంత్రి పదవితోపాటు ప్రభుత్వ సలహాదారు పదవిని ముస్లిం మైనార్టీలకు కేటాయించి, నూర్‌బాషాలను మాత్రం పక్కనపెట్టారని విమర్శించారు. ముస్లిం మైనార్టీలకు కేటాయించే నామినేటెడ్ పదవుల్లో కనీసం మూడింటితోపాటు డైరెక్టర్ పదవుల్లో 30 శాతం నూర్‌బాషాలకు అవకాశం కల్పించాలని కోరారు. ప్రకాశం జిల్లాతోపాటు రాయలసీమ ప్రాంతంలో అధికంగా ఉన్న నూర్‌బాషాలపై చిన్నచూపు చూడటం సరికాదని పేర్కొన్నారు.

అధ్వానంగా క్రీడా మైదానం

- ఆటలకు విద్యార్థులు దూరం
- బురదతో దుర్వాసన
- విద్యార్థుల అవస్థలు



గ్రౌండ్‌లో నిలిచిన వర్షం నీరు

పెద్దారవీడు: మానసిక ఉల్లాసానికి క్రీడలు ఎంతో అవసరం. విద్యార్థులు చదువుతో పాటు ఆటలు చాలా ఉపయోగకరమని నేతలు బహిరంగంగానే చెబుతుంటారు. సదుపాయలు కల్పించాల్సిన బాధ్యతపై అశ్రద్ధ చూపుతున్నారు. మైదానం అస్తవ్యస్తంగా ఉండటంతో విద్యార్థులు ఆటలకు దూరమవుతున్నారు. మండలంలో మద్దలకట్ట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో క్రీడా మైదానం అభివృద్ధికి నోచుకోక ఆధ్వానంగా తయారైంది. పాఠశాలలో మొత్తం 220 మంది విద్యార్థులు చదువుతున్నారు. క్రీడా మైదానంలో అక్కడక్కడా గుంతలు ఏర్పడ్డాయి. దీంతో వర్షం కురిస్తే క్రీడా మైదానంలో నీరు నిలిచి చెరువును తలపిస్తుంది. నీరు నిలబడటంతో చాలాచోట్ల గడ్డి, పిచ్చిమొక్కలతో దర్శనం ఇస్తోంది. గుంతల్లో నీరు నిల్వ ఉండటంతో విద్యార్థులు ఆటలు అడుకునేందుకు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అయితే నేడు కీడా మైదానంలో ఆటలు ఆడుకునేందుకు వీల్లేని పరిస్థితి నెలకొంది. వర్షం నీరు నిల్వ ఉండి బురదతో రోజుల తరబడి ఉండటంతో ఆటలకు ఆటంకం కలుగుతోంది. విద్యార్థులకు ఆటలపై ఆసక్తి ఉన్నా వారి ప్రతిభ వెలుగులోకి వచ్చే కనీస మార్గం కనిపించడం లేదు. గుంతల్లో వర్షం నీరు రోజుల కొద్ది నిల్వ ఉండటంతో మురుగుగా తయారై దుర్వాసన వెదజల్లుతోందని, ఆటలు ఆడుకోవాలంటే తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి గ్రౌండ్‌లో గుంతలు పూడ్చి ఆటలు ఆడుకునేందుకు అనువుగా ఉండేలా చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.

వీరేశలింగం పంతులుకు ఘన నివాళి



వీరేశలింగం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అధికారులు

త్రిపురాంతకం: మండల కేంద్రం త్రిపురాంతకం శాఖా గ్రంథాలయంలో కందుకూరి వీరేశలింగం పంతులు 177వ జయంతి సందర్భంగా బుధవారం గ్రంథపాలకుడు జి. రామంజినాయక్ ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సాహితీవేత్త, కళావేదిక రాష్ట్ర కార్యదర్శి గొట్టిముక్కల నాసరయ్య మాట్లాడుతూ సంఘసంస్కర్త, బహుముఖ ప్రజ్ఞాశాలి, తెలుగు జాతికి నవయుగ వైతాళికుడు వీరేశలింగం పంతులని కొనియాడారు. బాల్య వివాహాలను అరికట్టడంలో ఆయన చేసిన కృషి చాలా గొప్పదన్నారు. బీసీ హాస్టల్ అధికారి ఎం.కాశినాయక్, చిన్నవెంకటస్వామి, నీలం ఇసాక్, మెడబలిమి బ్రహ్మం, అనంతయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

మానసిక ఉల్లాసానికి క్రీడలు దోహదం



టేబుల్ టెన్నిస్ ఆడుతున్న క్రీడాకారులు

పెద్దారవీడు: క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదపడతాయని ప్రిన్సిపాల్ కర్తార్‌సింగ్ గుర్జర్ అన్నారు. మండలంలోని రాజంపల్లి సమీపం కేంద్రీయ విద్యాలయంలో హైదరాబాద్ రిజనల్ లెవల్లో బాల బాలికలకు అండర్ 14, 17, 19 విభాగాలకు టేబుల్ టెన్నిస్ పోటీలు బుధవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో నైపుణ్యం చాటాలని, జాతీయ స్థాయి క్రీడల్లో రాణించాలని ఆకాంక్షించారు. క్రమశిక్షణ, ప్రణాళికాబద్ధంగా క్రీడలపై ఏకగ్రతతో ఆడితే ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చన్నారు. పోటీల్లో 17 కేంద్రీయ విద్యాలయ బాలబాలికలు హాజరయ్యారు. ఉపాధ్యాయులు, పీడీలు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే ఆరోగ్యం



కురిచేడు: సీమంతాలు చేస్తున్న జెడ్పీటీసీ నాగిరెడ్డి, ఎంపీపీ కోటేశ్వరమ్మ



వై.పాలెం: గర్భిణులకు సీమంతం చేస్తున్న అధికారులు

యర్రగొండపాలెం: గర్భిణులు, బాలింతలు క్రమం తప్పకుండా పౌష్టికాహారం తీసుకోవాలని, అప్పుడే ఆరోగ్యంగా ఉంటారని సీడీపీఓ ఎం.పద్మావతి అన్నారు. పోషణ పక్వాడా పక్షోత్సవాల్లో భాగంగా బుధవారం మండలంలోని పాలుట్ల గిరిజన గూడెంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులకు సామూహిక సీమంతాలు, ఆరు నెలలు నిండిన చిన్నారులకు అన్నప్రాసన కార్యక్రమం నిర్వహించారు. గర్భిణులు, బాలింతలకు ఆర్బీటీ డాక్టర్‌తో ఆరోగ్య పరీక్షలు చేయించారు. ఆరేళ్లలోపు పిల్లలకు బరువు, ఎత్తులు తీసి బరువు తక్కువ ఉన్న పిల్లలకు పరీక్షలు చేయించారు. అనీమియా తల్లులకు, బరువు తక్కువగా ఉన్న పిల్లలకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. ఐసీడీఎస్ సూపర్ వైజర్లు ఎ.పద్మజ, కేవీ సుబ్బమ్మ, ఎన్.శివలక్ష్మి, ఎం.హైమావతి, అంగన్‌వాడీ కార్యకర్తలు నాగమణి బాయి, ఈదమ్మ, హనుమమ్మ, పెద్ద ఈదమ్మ పాల్గొన్నారు.

తాళ్లూరు: గర్భిణులు, బాలింతలు పౌష్టికాహారం తీసుకుంటే ఆరోగ్యంగా ఉంటారని డాక్టర్ మౌనిక, డాక్టర్ శ్రీకాంత్ తెలిపారు. మండలంలోని తూర్పు గంగవరం పంచాయతీ సోమవర్పాడు అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం పోషణ్ పక్వాడ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రం నుంచి పొందే పౌష్టికాహారమైన బెల్లం, గుడ్లు, రాగిపిండి, వేరుశనగ పప్పు కోసం 12 వారాల లోపు పేరు నమోదు చేసుకోవాలన్నారు. పిల్లలకు వ్యాధి నిరోధిక టీకా వేయించాలని, గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పించారు. హెచ్‌ఈఓ చంద్రశేఖర్, ఏఎన్‌ఎంలు రమణమ్మ, అనిత, అంగన్‌వాడీ టీచర్లు విజయలక్ష్మి, నాగలక్ష్మి, ఆశాలు పుష్పలక్ష్మి, సువర్ణ పాల్గొన్నారు.

కురిచేడు: పోషకాహారం చిన్ననాటి నుంచి పిల్లలకు అందిస్తే వారికి సంపూర్ణ ఆరోగ్యం అందించవచ్చని జెడ్పీటీసీ నుసుం వెంకట నాగిరెడ్డి పేర్కొన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం ఐసీడీఎస్ సీడీపీఓ సీహెచ్ భారతి ఆధ్వర్యంలో పోషణ పక్వాడా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జెడ్పీటీసీ మాట్లాడుతూ పోషకాహార లోపం లేని సమాజాన్ని నిర్మించడమే లక్ష్యంగా అంగన్‌వాడీల ద్వారా పోషకాహారం అందిస్తున్నట్లు చెప్పారు. ఐదేళ్లు నిండిన పిల్లలను తప్పనిసరిగా ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని ఎంపీడీఓ సతీష్‌బాబు కోరారు. పోషణ పక్వాడా కార్యక్రమాలు ఈ నెల 22వ తేదీ వరకు జరుగుతాయని తెలిపారు. రక్తహీనత లేకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు. మండల స్థాయిలో వంటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. అనంతరం గర్భిణులకు సామూహిక సీమంతాలు, చిన్నారులకు అన్నప్రాసన, అక్షరాభ్యాసం చేశారు. ఎంపీపీ బెల్లం కోటేశ్వరమ్మ, సర్పంచ్ కేసనపల్లి కృష్ణయ్య, ఐటీసీ జిల్లా కో ఆర్డినేటర్ వెంకటరావు, సూపర్‌వైజరు సీహెచ్ సుభాషిణి పాల్గొన్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలో సామూహిక సీమంతాలు

దొనకొండ: స్థానిక బేతేలుపురం-2 అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం గర్భిణులకు సామూహిక సీమంతాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణిగా ఉన్నప్పటి నుంచి వెయ్యి రోజుల సంరక్షణ, మాతా శిశు మరణాలు జరగకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో కార్యకర్త జయమణి వివరించారు. అదే విధంగా గర్భిణులు ఐరన్ మాత్రలు ఎప్పుడు వాడాలి, ఎలాంటి ఆహారం తీసుకోవాలో ఏఎన్ఎం లీలాబాయి వివరించారు.



తాళ్లూరు: మాట్లాడుతున్న డాక్టర్ మౌనిక



గర్భిణికి చేస్తున్న సీమంతం

దివ్యాంగ విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలి



ఫిజియోథెరపీ చేస్తున్న అంకారావు

పుల్లలచెరువు: దివ్యాంగ విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఎంఈవో ఇందిర సూచించారు. బుధవారం స్థానిక ఎంఈవో కార్యాలయంలో ప్రత్యేక అవసరాలు కలిగిన విద్యార్థులకు ఫిజియోథెరపీ చేశారు.

వివిధ గ్రామాల నుంచి వచ్చిన 10 మంది విద్యార్థులకు ఫిజియోథెరపిస్టు అంకారావు వైద్య పరీక్షలు చేశారు. ఎంఈవో మాట్లాడుతూ ప్రత్యేక అవసరాల విద్యార్థులు ఇంటి వద్ద కూడా క్రమం తప్పకుండా ఫిజియోథెరపీ చేసుకోవాలని, తల్లిదండ్రులు కూడా వీరిపై ప్రత్యేక శ్రద్ధ చూపుతూ వారి అభివృద్ధికి బాటలు వేయాలని సూచించారు.

చెంచుల ఆర్థిక పరిస్థితులు మెరుగుపడాలి



ఉపాధి పనులు పర్యవేక్షిస్తున్న ఐటీడీఏ ప్రత్యేకాధికారి నాగేశ్వరరావు

యర్రగొండపాలెం: ఉపాధి హామీ పనుల ద్వారా చెంచులు తమ ఆర్థిక పరిస్థితులు మెరుగు పర్చుకోవాలని ఐటీడీఏ ప్రత్యేకాధికారి కె.నాగేశ్వరరావు అన్నారు. బుధవారం మండలంలోని హనుమంతునిగూడెం, పునరావాస కాలనీ, బిళ్లగొంది, పోతురాజుపెంట చెంచు గూడేల్లో ఆయన సందర్శించి ఎన్ఆర్‌ఈజీఎస్ పనులపై అవగాహన కల్పించారు. గూడేల్లోని ప్రతి ఒక్కరూ ఉపాధి పనుల్లో పాల్గొని 150 రోజుల పని దినాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. తమకు ఇచ్చిన కొలతల ప్రకారం పనులు చేసి రోజు వారి కూలీ రూ.307లు పొందాలని, పనులకు వచ్చే సమయంలో ప్రతి ఒక్కరూ తమ వెంట తాగునీరు తెచ్చుకోవాలని సూచించారు. పనులు జరిగే ప్రాంతంలో ప్రథమ చికిత్స పెట్టెను అందుబాటులో ఉంచాలని జూనియర్ టెక్నికల్ అసిస్టెంట్‌లు కుదుముల అంజయ్య, భూమని వెంకటరామయ్యలను ఆదేశించారు.

అకాల వర్షానికి నష్టపోయిన రైతులను ఆదుకోవాలి



ఏఓకు వినతిపత్రం అందజేస్తున్న రైతు సంఘ నాయకులు

ముండ్లమూరు (కురిచేడు): ఇటీవల కురిసిన అకాల వర్షాలకు పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం కోరింది. మండలంలో బొప్పాయి, మిరప, మొక్కజొన్న, వరి, పొగాకు పంటలు తీవ్రంగా దెబ్బతిని రైతులు నష్టపోయారని సంఘ నాయకులు పంట ఏడుకొండలు, గాలి వెంకటేశ్వర్లు, షేక్ మీరావలి, గంగినేని సత్యనారాయణ తెలిపారు. బుధవారం మండలంలో పర్యటించి నష్టపోయిన పంటలను పరిశీలించారు. అలాగే పొగాకు రైతులు తమ పంటను కంపెనీలు గిట్టుబాటు ధరకు కొనుగోలు చేయడం లేదని వారికి తెలిపారు. కంపెనీలపై ప్రభుత్వం ఒత్తిడి తెచ్చి పొగాకు కొనుగోలు చేసి రైతులను ఆదుకునేలా చర్యలు చేపట్టాలని కోరారు. అనంతరం మండల వ్యవసాయాధికారికి వినతిపత్రం అందజేశారు. రైతు సంఘ నాయకులు బోడపాటి హనుమంతురావు, రాజా రమేష్, వెల్లంపల్లి ఆంజనేయులు, నాగరాజు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన



ఓ అపార్ట్‌మెంట్‌లో డెమో చూపుతున్న అగ్నిమాపక సిబ్బంది

దర్శి (కురిచేడు): అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా బుధవారం స్థానిక నివాస గృహాల సముదాయాల్లో అగ్నిప్రమాదాల నివారణ ఎలా అనే విషయంపై ప్రజలకు అవగాహన కల్పించినట్లు అగ్నిమాపక కేంద్ర అధికారి సీహెచ్ జాలయ్య తెలిపారు. గ్యాస్‌తో కలిగే అగ్ని ప్రమాదాలు, విద్యుత్‌తో కలిగే అగ్ని ప్రమాదాలు, వాటికి ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు డెమో ద్వారా వివరించారు. అనంతరం కరపత్రాలు పంపిణీ చేశారు. సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

మంచినీటి పైప్‌లైన్‌కు లీకేజీలు





పైపులైన్ లీకేజీలతో బురదమయంగా మారిన రహదారులు

కొమరోలు: మండలంలోని మల్లారెడ్డిపల్లె గ్రామంలో మంచినీటి పైపులైన్ అడుగడుగునా లీకులమయంగా మారింది. దశాబ్దం క్రితం వేసిన ఈ మంచినీటి పైపులైన్‌కు తరచూ లీకేజీలు ఏర్పడుతున్నాయి. మంచినీరు వదిలిన ప్రతిసారీ లీకేజీలు ఉన్న ప్రాంతాల్లో రహదారులన్నీ బురదమయంగా మారుతున్నాయి. నీరు అలాగే నిల్వ ఉండటంతో దోమలు విజృంభిస్తున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీ అధికారులకు సమస్య తెలిపినప్పటికీ పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఉన్నతాధికారులు స్పందించి పైప్‌లైన్ లీకేజీలను అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.